సాక్షి చిత్తూరు
శనివారం ၊ 21 ၊ సెప్టెంబర్ ၊ 2024





## కమనీయం.. విమానోత్సవం

కాణిపాక వరసిద్ధుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి విమానోత్సవం ఘనంగా జరిగింది. - 8లో



## సరిహద్దులు దాటుతున్న పేదల బియ్యం

అధికారం అండతో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. జీడీ నెల్లూరు నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. - 8లో



## టెంపో ట్రావెల్లర్ బోల్తా

బంగారుపాళెం మండలం మొగిలి ఘాట్‌లో బొలెరో వాహనం ఢీకొనడంతో టెంపో ట్రావెల్లర్ బోల్తాపడింది. - 8లో

## న్యూస్‌రీల్

### ట్రాన్స్‌కో స్టోర్ పరిశీలన



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో స్టోర్‌ను ఆ శాఖ టెక్నికల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పరిశీలించారు. స్టోర్‌కు వస్తున్న వస్తువులు, సరఫరా, నిల్వ వివరాలను తనిఖీ చేశారు. విద్యుత్ పరికరాల క్వాలిటీని పరిశీలించారు. ప్రస్తుతం నిల్వ ఉన్న పరికరాలు, అవసరమైన వాటి గురించి ఆరా తీశారు. పరికరాల కోసం టెండర్లు పిలిచామని, అవి పూర్తయితే మరిన్ని వస్తాయని సిబ్బంది వివరించారు. ఈఈ మునిచంద్ర, డీఈ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టండి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీఎల్) ఓంకార్‌రావు తెలిపారు. ఆయన శుక్రవారం కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.43 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, అనుబంధ రంగాల కార్మికులు పేర్లు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. అర్హత కలిగి నమోదు చేసుకోని వారి కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్టు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు సభ్యత్వం తీసుకుంటే పథకాలతో పాటు, ప్రమాదబీమా రూ.5 లక్షలకు వర్తిస్తుందన్నారు. కార్మిక సంఘాల నాయకులు గ్రామ, మండల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఏఎల్ఓ జగదీష్‌బాబు, కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం నాయకులు కుమరేషన్, సీపీఎం నాయకులు మురళీ, జ్యోతి, మునికృష్ణ, శంకరాచారి, విజయ, సురేష్ పాల్గొన్నారు.

### ప్రశాంతంగా వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఉన్న వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శుల బదిలీల ప్రక్రియ శుక్రవారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు కమిషనర్ కమిషనర్ పి.నరసింహప్రసాద్ తెలిపారు. పలు కేటగిరీల్లో బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు వారికి కేటాయించిన కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని సంబంధిత అధికారుల వద్ద కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వార్డు అడ్మిన్ కార్యదర్శులు – 18 మంది, ప్రణాళిక కార్యదర్శులు –18 మంది, అమినిటీ కార్యదర్శులు – 15 మంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు– 16 మంది, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 17 మంది, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్యదర్శులు 30 మంది హాజర య్యారు. కార్యక్రమంలో పలమనేరు, పుత్తూరు, పుంగనూరు, నగరి కమిషనర్లు పాల్గొన్నారు.

### 27,28 తేదీల్లో లిప్ బేస్‌లైన్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 27,28 తేదీల్లో లిప్ (లెర్నింగ్ ఇంప్లిమెంట్ ప్రోగ్రాం) బేస్‌లైన్ పరీక్ష నిర్వహించాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాఠశాలల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఆ పరీక్షకు సంబంధించిన మోడల్ ప్రశ్నాపత్రాలను వారు విడుదల చేశారు.

### గైర్హాజరు టీచర్ల వివరాల సేకరణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ అనధికారికంగా గైర్హాజరవుతున్న టీచర్ల వివరాలను విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారు. పాఠశాలలకు అనధికారికంగా గైర్హాజరవుతున్న, డిప్యుటేషన్‌లో ఉన్న టీచర్ల వివరాలను వెంటనే పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.

### జనరల్ నర్సింగ్ కోర్సుకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 2024–25 విద్య సంవత్సరంలో ప్రైవేటు నర్సింగ్ స్కూల్‌లో జనరల్ నర్సింగ్, మిడ్ వైఫరీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి తెలిపారు. ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లో ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తు పూర్తి చేసి రూ.500 డీడీతో ఈ నెల 29వ తేదీలోపు చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు, ఇతర వివరాలకు www.dme.ap.nic.in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

---

నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే మెరుగైన విద్య అవసరం. ముఖ్యంగా సీబీఎస్ఈ (సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ చదివిన విద్యార్థులే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్కారు బడుల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను తీసుకువచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్కారు బడుల్లో సీబీఎస్ఈ అమలును రద్దు చేసింది. దీంతో సీబీఎస్ఈ చదువుతున్న తొమ్మిది, పది తరగతులు విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.



సీబీఎస్ఈ విధానం అమలైన బైరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్



నగరి నియోజకవర్గంలోని సత్రవాడ సీబీఎస్ఈ జెడ్పీ హైస్కూల్

# పేద విద్యార్థులకు కూటమి శాపం

- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం నిలిపివేత
- నష్టపోయిన పేద, మధ్యతరగతి పిల్లలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు
- సీబీఎస్ఈ రద్దు వల్ల కూటమి సర్కారుకు ఒరిగిందేమిటని ప్రశ్న

చిత్తూరు కలెక్టరేట్ : గత ఐదు సంవత్సరాల్లో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులొచ్చాయి. విజ్ఞానకాంతులు వెదజల్లాయి. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలని ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదుకునే విద్యార్థులకు బోధించే సీబీఎస్ఈ సిలబస్‌ను సర్కారు బడుల విద్యార్థులకు చేరువ చేశారు. 2021–2022 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేసింది.

**మళ్లీ మొదటికి ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి**

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలల్లోనే అనాలోచిత నిర్ణయాలను అమలు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేసింది. తద్వారా పేద విద్యార్థులను నాణ్యమైన విద్యకు దూరం చేసింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ స్కూళ్లను మళ్లీ మొదటికే తీసుకెళ్తున్నారని విద్యావేత్తలు మండిపడుతున్నారు. పేద విద్యార్థులు ఎప్పటికీ కింది స్థాయిలోనే ఉండిపోవాలా అని నిలదీస్తున్నారు. తమ పిల్లలకు అత్యుత్తమ విద్య అందకుండా అడ్డుకుంటూ వివక్ష చూపుతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**3,103 మంది పిల్లల భవిష్యత్ చీకటిమయం**

### జిల్లాలోని పాఠశాలల వివరాలు

| జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు | సీబీఎస్ఈ విధానం అమలైన పాఠశాలలు |
| --- | --- |
| 353 | 23 |
| **తొమ్మిదవ తరగతి చదివిన విద్యార్థులు** | **పదవ తరగతి చదివిన వారు** |
| 1,572 | 1,531 |
| **సీబీఎస్ఈ రద్దుతో నష్టపోయిన పిల్లలు** | |
| 3,103 | |

కూటమి ప్రభుత్వం తీసుకున్న సీబీఎస్ఈ రద్దు వల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 3,103 మంది విద్యార్థుల భవిష్యత్తు చీకటిమయమైంది. గత ఐదు సంవత్సరాల్లో పేద విద్యార్థుల తలరాతలను మార్చే

**నిరుపేద విద్యార్థులకు ఖరీదైన విద్య**

జిల్లాలోని 23 పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. వీటిలో తొమ్మిది, పది తరగతుల్లో 3,103 మంది విద్యనభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వ నిర్ణయంతో నిరుపేద విద్యార్థులకు ఖరీదైన విద్య అందుబాటులోకి వచ్చింది. సీబీఎస్ఈ సిలబస్‌తో పది, ఇంటర్ పూర్తి చేస్తే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సత్తాచాటే అవకాశం దక్కుతుంది. ఈ విధానం కేంద్ర ప్రభుత్వ, కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో మాత్రమే అందుబాటులో ఉంది. మొట్టమొదటి సారి వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈని అమలు చేశారు.

### సీబీఎస్ఈ వల్ల కలిగిన ప్రయోజనాలు ఇవే

- జిల్లాలోని 23 పాఠశాలల్లో సీబీఎస్ఈ చదివిన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఎక్కడికి వెళ్లినా మంచి గుర్తింపు పొందేలా శిక్షణ పొందారు.
- దేశంలో ప్రముఖ విద్యా సంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్, జిప్‌మర్, సీఎంసీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ, నీట్ వంటివి సీబీఎస్ఈ సిలబస్‌లో నేర్చుకున్నారు.
- ఒత్తిడికి లోను కాకుండా తమ ఆసక్తికి అనుగుణంగా విద్యార్థులు చదువులు కొనసాగించారు.
- సీబీఎస్ఈ వల్ల ఏ రాష్ట్రానికి వెళ్లినా ఇబ్బంది లేకుండా చదువులు కొనసాగించవచ్చు అనే ధైర్యం పొందారు.
- నైపుణ్యాలను పెంపొందించుకుని ఈ విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానంలో పది పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు.
- సమస్యలను తనంతట తాను పరిష్కరించుకునే సామర్థ్యం విద్యార్థుల్లో పెంపొందిందని టీచర్లు చెబుతున్నారు. అలాగే విద్యార్థులు తమంతట తామే చదువుకోగలిగే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని వెల్లడిస్తున్నారు.

విద్యకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేసింది. వాటిని ప్రస్తుతం కూటమి సర్కారు ఒక్కొక్కటిగా రద్దు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రైవేట్ బాట పట్టించేందుకు కుట్రలు చేస్తోందని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

**సీబీఎస్ఈతో విద్యార్థుల్లో నైపుణ్యం**



ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం అమలుతో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందాయి. ప్రస్తుతం నడుస్తున్న పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు పిల్లలు సన్నద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. సీబీఎస్ఈ అమలయ్యే పాఠశాలల పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్తుంది. సీబీఎస్ఈ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలి.

– మంజునాథగుప్త, ఆపస్ జిల్లా అధ్యక్షుడు, చిత్తూరు

**పేదల వ్యతిరేకులుగా మారుతారు**



సర్కారు బడుల్లో అమలవుతున్న సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేయడం వల్ల కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేకగా మారుతుంది. సీబీఎస్ఈ రద్దుతో ప్రభుత్వానికి ఒరిగేది ఏమో అర్థం కావడం లేదు. పేద విద్యార్థులు బాగుపడడం సర్కారుకు ఇష్టం లేదా? ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల పట్ల వివక్ష ఎందుకు చూపుతున్నారో తెలపాలి. సీబీఎస్ఈ విధానాన్ని కొనసాగించాల్సిందే.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

---

# వచ్చారు.. వెళ్లారు

- తూతూమంత్రంగా జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు
- అమూల్ డెయిరీపై నివేదిక ఇవ్వాలన్న జెడ్పీ చైర్మన్
- రెండు గంటల్లో ముగిసిన సమావేశం
- నామమాత్రంగా చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు తూతూమంత్రంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డి, జెడ్పీ సీఈఓ గ్లోరియా, వైస్ చైర్మన్లు ధనుంజయరెడ్డి, రమ్య, స్త్రీ శిశు సంక్షేమ కమిటీ చైర్మన్ భారతి వేర్వేరుగా 1–7 సమావేశాలు చేపట్టారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ చేపట్టాల్సి ఉండగా రెండు గంటల్లోనే ముగించారు. శాఖల వారీగా నామమాత్రంగా చర్చలు జరిపి మమా అనిపించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు పలు అంశాలపై అధికారులను ప్రశ్నించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండల పరిధిలో అభివృద్ధి, నీటి సరఫరా కోసం రూ.30 లక్షలు మంజూరు చేశామన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్యాచ్ వర్క్స్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వి.కోటలోని కేజీఎఫ్ రోడ్డు అధ్వానంగా ఉందని, అవసరమైతే జెడ్పీ నిధులతో వాటిని బాగు చేయించాలన్నారు. జాతీయ రహదారి పనుల్లో పలు ప్రాంతాల్లో రైతులు పొలాల్లోకి వెళ్లడానికి అండర్ పాస్‌లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఏఐ శాఖ అధికారులు సమావేశానికి రాకపోవడంతో సమాచారం ఇవ్వాలని డిప్యూటీ సీఈఓను ఆదేశించారు. అమూల్ డెయిరీ పరిస్థితి ఏమిటి..? పాలసేకరణ ఎందుకు ఆపివేశారు, దీనిపై ప్రభుత్వం నుంచి ఏవైనా ఆదేశాలు ఉన్నా అని నిలదీశారు. దీనిపై సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో రాత్రిళ్లు వైద్య సేవలు అందడం లేదని, డాక్టర్లు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌కో అధికారులు మాట్లాడుతూ మెటీరియల్ సరఫరా కోసం టెండర్లు పిలిచామని, వచ్చాక అందజేస్తామని తెలిపారు. పాలసముద్రం జెడ్పీటీసీ అన్బలగన్ మాట్లాడుతూ మండలాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తమను పిలవడం లేదని తెలిపారు. నగరి జెడ్పీటీసీ గాంధీ మాట్లాడుతూ చేపల చెరువు లీజును ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు సాగుచేసుకుంటున్న భూములకు పటాలు ఇవ్వాలని కోరారు. సత్యవేడు జెడ్పీటీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ బీసీకాలనీ అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పెనుమూరు మండలం ఎగువపూనేపల్లెలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామని, బిల్లులు ఇవ్వలేదని కోఆప్షన్ సభ్యుడు హమీన్ తెలిపారు. మసీదులో పనిచేస్తున్న మౌజన్, ఇమామ్‌లకు జీతాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. చిత్తూరులో మైనార్టీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరారు.

**కోరం లేకుండానే జెడ్పీ స్థాయీ సంఘాలు**

జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు కోరం లేకుండానే ముగించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహించిన సమావేశానికి సంబంధిత జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు మంత్రి నారాలోకేష్ పర్యటన ఉండటంతో ఇక్కడికి రాలేదు. సాధారణంగా 1–7 స్థాయీ సంఘాల సమావేశాల్లో ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, వ్యవసాయ, స్త్రీ శిశు సంక్షేమం, రహదారులు, పరిశ్రమలు, ఉపాధి, పౌరసరఫరా, పంచాయతీరాజ్ వంటి అంశాలపై చర్చిస్తారు. ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు సమస్యలు తెలిపితే సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యేలు ఇటువైపు రారని తెలియడంతో జెడ్పీటీసీలు కూడా ఎక్కువ మంది రాలేదు. దీంతో కోరం లేకపోయినా మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారు. 3, 5, 6 వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం సంఘాలకు కలిపి మొత్తం 36 మందికి గాను 12 మంది వస్తే కోరం ఉన్నట్లు లెక్క. 8 మంది సభ్యులు మాత్రమే రాగా గుట్టుచప్పుడు కాకుండా ముగించినట్లు విమర్శలు వస్తున్నాయి.

# బాధ్యతతో పనిచేద్దాం

- టీటీడీ పవిత్రతను కాపాడతాం
- ఐటీ శాఖ మంత్రి నారాలోకేష్
- బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం



ప్రజావేదికలో మాట్లాడుతున్న మంత్రి నారాలోకేష్

కాణిపాకం: ప్రజా ప్రభుత్వంలో బాధ్యతగా పనిచేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆయన శుక్రవారం యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు బంగారుపాళ్యం మండలంలోని సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్, ఔట్ పేషెంట్ బ్లాక్‌ను ప్రారంభించారు. అంతకుముందు ఎస్ఎల్‌వీ కల్యాణ మండపంలో ఉత్తమ కార్యకర్త, మన టీడీపీ యాప్ ఛాంపియన్స్‌తో సమావేశం నిర్వహించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ 2023–24 కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మన టీడీపీ యాప్ ద్వారా ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఎస్.కోటూరులో ప్రజావేదికను ఉద్దేశించి మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. 2019–24 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమను చాలా ఇబ్బంది పెట్టిందన్నారు. ప్రజలు టీడీపీ కూటమికి 164 సీట్లు కట్టబెట్టి పవిత్రమైన బాధ్యత అప్పగించారని, దాన్ని హుందాగా నెరవేరుద్దామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, తమ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులు, నాయకులపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అనేక హామీలు నెరవేర్చామన్నారు. ఇసుక విధానాన్ని మెరుగుపరుస్తామన్నారు. 2019 కంటే తక్కువ ధరకు అందేలా చేస్తామన్నారు.

**టీటీడీ పవిత్రతను కాపాడుతా**

పింక్ డైమెండ్ పేరుతో తమపై దుష్ప్రచారం చేశారని నారా లోకేష్ తెలిపారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని విని షాకయ్యానన్నారు. వాటి రిపోర్టులు కూడా బయటపెట్టామని తెలిపారు. తిరుమలలో ప్రమాణానికి సిద్ధమని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారని, తాను తిరుపతిలోనే ఉన్నానని.. ప్రమాణానికి సిద్ధమన్నారు. ప్రజాప్రభుత్వం టీటీడీని ప్రక్షాళన చేస్తుందన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేలా చర్యలు చేపడతామన్నారు. నిత్యాన్నదానంలోనూ నాణ్యత లేదని చెప్పుకొచ్చారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీ దుగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తినాని, కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు.

# టీచర్లు సమయపాలన పాటించాలి

- హైస్కూళ్లలోనే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు
- కడప ఆర్జేడీ శామ్యూల్



ఎంఈఓలతో మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని వైఎస్ఆర్ కడప జిల్లా ఆర్జేడీ శామ్యూల్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం డీఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంఈఓలు, డీఈఓ కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మోడల్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండేవన్నారు. ప్రస్తుతం హైస్కూళ్లలో మాత్రమే అమలు చేయనున్నట్లు చెప్పారు. స్కూల్ కాంప్లెక్స్‌లు తగ్గితే సీఆర్‌పీల ఉద్యోగాలు ఉండవనే అపోహలను సీఆర్‌పీలు నమ్మవద్దని, ఎవరినీ తొలగించేది లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. డీఈఓ దేవరాజు, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, గుణశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీఈఓ కార్యాలయం ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు సత్య, వీజీ రమణ, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

### డిప్యుటేషన్ వేస్తే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు డిప్యుటేషన్ వేస్తే కఠిన చర్యలుంటాయని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు శుక్రవారం హెచ్చరించారు. ఇటీవల అన్ని పాఠశాలల్లో టీచర్లను సర్దుబాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొంత మంది డీఈఓలు నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ వేస్తున్నట్లు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

### ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా ప్రభావతి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్‌గా ప్రభావతిని నియమిస్తూ ఏపీవీవీపీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా కొనసాగుతున్న రాజశేఖర్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. ప్రభావతి నగరి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

# ప్రజావేదిక.. ముందస్తు ప్రణాళిక..?

- ప్రశ్నలు..జవాబులు... చదివించారు
- సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలకు దొరకని అవకాశం
- తూతూమంత్రంగా లోకేష్ ప్రజా వేదిక



సభా వేదిక నుంచి వెళ్లిపోతున్న జనం

కాణిపాకం: బంగారుపాళ్యం మండలం ఎస్.కోటూరులో శుక్రవారం మంత్రి నారా లోకేష్ ముందస్తు ప్రణాళిక ప్రకారమే ప్రజావేదిక నిర్వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలు వింటానంటూ ముందుగానే కొంత మందికి స్క్రిప్ట్ రాయించి ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం దక్కకపోవడంతో పలువురు ప్రజలు ఆవేశంతో ఊగిపోయారు. ప్రజా వేదిక నుంచి వెళ్లిపోయారు. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ముందుగా మంత్రి లోకేష్ మాట్లాడి తర్వాత సమస్యలు వింటానంటూ మైకు ఇచ్చారు. వారు ఏ ప్రశ్న అడగాలో ముందుగానే నూరి పోసి తీసుకొచ్చినట్లు కనిపించింది. 15 నిమిషాల పాటు సాగిన ప్రజల ప్రశ్న– మంత్రి జవాబు సుత్తిమెత్తగా జరిగిపోయింది. ఆపై కొందరు తమ సమస్యలు చెప్పుకోవాలన్నా అవకాశం దక్కకుండా పోయింది. వారు ఆవేశంతో ఊగిపోయారు. ఈ పసుపు చొక్కాకైనా గుర్తింపు ఇవ్వలేదంటూ ఒక కార్యకర్త వాపోయాడు. ఇంతలోనే జనం సభ వేదికకు దూరమయ్యారు. చాలా వరకు కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

**ఆస్పత్రిలో అత్యవసర సేవకు బ్రేక్...**

డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవ సమయంలో అత్యవసర సేవలకు బ్రేక్ పడింది. ఓపీలకు కూడా స్వస్తి చెప్పారు. ఒక తల్లి తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తన కుమార్తెను అత్యవసర విభాగం వద్దకు తీసుకొచ్చినా వైద్యం అందక కుమార్తెను ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లింది. మంత్రి వెళ్లిన తర్వాత కూడా వైద్య సేవలు అందకపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## క్లుప్తంగా

### గ్రానైట్ లారీ సీజ్



స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీ

కుప్పం: కుప్పం మీదుగా తమిళనాడుకు గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. కుప్పం సీఐ జీటీ నాయుడు తమ సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం పట్టణ సమీపంలో వాహనాల తణఖీ చేపట్టారు. ఈ సందర్భంగా లారీని పరిశీలించారు. అందులో 35 టన్నుల గ్రానైట్ దిమ్మెలు ఉండడాన్ని గుర్తించారు. వాటికి పర్మింట్లు లేవు. అలాగే వాహనానికి కూడా రికార్డులు లేవు. దీంతో లారీని, గ్రానైట్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

### కేబుల్ కాల్చివేత



సదుం: మండల కేంద్రమైన సదుంలో ఉన్న గార్గేయ నది వంతెనపై వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. సమాచారం అందుకున్న సర్పంచ్ ఉషారాణి, పంచాయతీ ఈవో హసీనా అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఉద్దేశ పూర్వకంగానే కేబుల్‌ను దగ్ధం చేశారని భావిస్తున్నట్టు చెప్పారు. మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా పాదచారుల కోసం వంతెనలో నిర్మించిన ఫుట్‌పాత్ మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం అక్కడే మద్యం సేవించి బాటిళ్లను దారిలోనే పడేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇంటితోపాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా మలేరియా అధికారి అనీల్‌కుమార్ తెలిపారు. తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఆయన శుక్రవారం చిత్తూరు నగరంలోని ఓటిచెరువు, మసీదు మిట్ట ప్రాంతాల్లో చేపట్టిన ఫ్రై డే...డ్రై డే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, పీరూ సాహెబ్, ఫర్హాత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం



ఎమ్మెల్యే థామస్‌తో నిందితుడు సూరిరెడ్డి(ఫైల్)



# సరిహద్దులు దాటుతున్న పేదల బియ్యం

- ప్రతి రోజూ ఐదు టన్నుల బియ్యం తరలింపు
- జీడీ నెల్లూరు కేంద్రంగా అక్రమ రవాణా
- కూటమి నేతలదే హవా

అధికారం ఉంటే ఏమైనా చేయవచ్చని కూటమి నేతలు నిరూపిస్తున్నారు. ప్రజలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తూ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. రోజుకు సుమారు ఐదు టన్నులకు పైగా బియ్యాన్ని తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఇందుకు గంగాధరనెల్లూరు కేంద్రంగా మారింది. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉంది. ఇది కూటమి నేతలకు బాగా కలిసి వచ్చింది. అధికారంలోకి వచ్చిన రోజు నుంచే అక్రమాలకు తెరలేపారు. ముందుగా పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. దానికి పాలీస్ పట్టి బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాకింగ్ చేస్తారు. తర్వాత బ్రాండెడ్ బియ్యం అని చెప్పి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో బ్రాండెడ్ బియ్యం కంటే కొంత తక్కువ ధర ఉండడంతో ప్రజలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఇలా గంగాధర నెల్లూరు నుంచి రోజుకు సుమారు ఐదు టన్నుల కంటే ఎక్కువ బియ్యం ఎగుమతి అవుతున్నట్టు సమాచారం. అధికారులు దాడులు, తనిఖీలు చేయకపోవడంతో కూటమి నేతల అక్రమ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది.

**రోజుకు ఐదు టన్నులకు పైగా ఎగుమతి**

గంగాధరనెల్లూరు నియోజవర్గం నుంచి ప్రతి రోజూ దాదాపు ఐదు టన్నులకు పైగా బియ్యం ఎగుమతి జరుగుతున్నట్టు సమాచారం. వ్యాపారులు తాము నియమించుకున్న ఏజెంట్ల ద్వారా పేదల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వాటిని స్థానికంగా ఉన్న కోళ్లఫారంలో నిల్వ ఉంచుతున్నారు. రాత్రిళ్లు మన రాష్ట్రం నుంచి పళ్లిపట్టు, బలిజకండ్రిగ, తూగుండ్రం, పాలసముద్రం మీదుగా తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారు. అక్కడి నుంచి కర్ణాటకకు పంపిస్తున్నారు. ఈ అక్రమ దందాకు కొంతమంది పౌర సరఫరా శాఖ అధికారులు, స్థానిక డీలర్లు సహకరిస్తున్నట్టు తెలిసింది. బియ్యం అక్రమ రవాణాపై స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమ బియ్యం నిల్వలపై దాడులు**

గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో ఉన్న కోళ్లఫారంలో కూటమి నేతలు తమిళనాడు బియ్యం అక్రమంగా నిల్వచేసినట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా ఉంచిన దాదాపు 5 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌ను సీజ్ చేశారు. అక్రమ బియ్యం కేసును నీరుగార్చేందుకు కూటమి నేతల ప్రయత్నాలను స్థానికులు తిప్పకొట్టారు. దీంతో బియ్యం అక్రమాలకు పాల్పడిన శ్రీరంగరాజపురం మండలం 49 కొత్తపల్లిమిట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సూరిరెడ్డి (37), పూళ్లూరు క్రాస్‌కు చెందిన మురగన్ (37), గంగాధరనెల్లూరు మండలం గొల్లపల్లికి చెందిన లోకనాథరెడ్డి, తమిళనాడు రాష్ట్రానికి చెందిన అశోక్‌కుమార్‌పై కేసులు నమోదు చేశారు. వారిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు

**అక్రమ వ్యాపారులపై నిఘా**



ప్రజలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా రవాణా చేయడం నేరం. అక్రమ వ్యాపారులపై నిఘా పెట్టాం. బియ్యం అక్రమ రవాణాపై దాడులు చేస్తాం. ప్రజలు పోలీసులకు సహకరించి సమాచారం ఇవ్వాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మన్న, గాంగధరనెల్లూరు సీఐ

# కమనీయం.. విమానోత్సవం



స్వామి వారి విమానోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రత్యేక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సిద్ధి బుద్ధి వినాయకస్వామి విమానోత్సవం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అలంకార మండపంలో ఉత్సవమూర్తికి క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేసి పట్టుపీతాంబరాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో అలంకరించి విమానంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, మేళతాళలు, కోలాటాల మధ్య స్వామి వారు విమానంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు.

**నేడు పుష్ప పల్లకి సేవ**

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పుష్ప పల్లకి సేవను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. రద్దీ దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

**తన్మయ భరితం.. నాట్యం..**

ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆస్థాన మండపంలో శుక్రవారం నిర్వహించిన కూచిపూడి, భరత నాట్యం అలరించాయి. తిరుపతి, చిత్తూరుకు చెందిన కళాకారులు హావ, భావ, పద విన్యాసాలతో ప్రదర్శించిన నృత్యాలు సభికులను భక్తి భావంలో ముంచెత్తాయి. అలాగే గీతాలాపాలన భక్తి భావాన్ని పెంపొందించింది. కళాకారులను ఈవో గురుప్రసాద్ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

## కో–ఆప్షన్ సభ్యుడిపై దాడి

పూతలపట్టు: మండలానికి వైఎస్సార్ సీపీకి చెందిన కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలీపై గురువారం రాత్రి ముగ్గురు తెలుగు తమ్ముళ్లు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఖాదర్ వలీ గురువారం రాత్రి పూతలపట్టులోని పాలసేకరణ కేంద్రానికి బయలుదేరాడు. అదే సమయంలో టీడీపీ కార్యకర్త అతని వాహనాన్ని ఆపాడు. ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించిన ఖాదర్‌వలీపై దాడికి దిగాడు. సమీపంలోనే ఉన్న మరో ఇద్దరు యువకులు కూడా దాడికి దిగారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో ముగ్గురిలో ప్రధాన నిందితుడు పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

## నకిలీ పత్రాల తయారీపై కేసు నమోదు

వెదురుకుప్పం: మండలంలోని గంటావారిపల్లెలో నకిలీ రెవెన్యూ పత్రాలు తయారు చేసిన వ్యక్తిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. గంటావారిపల్లెకు చెందిన పుల్లారెడ్డి సమీప బంధువులకు చెందిన భూమికి నకిలీ పత్రాలు సృష్టించి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఇందులో భాగంగా పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లాడు. అక్కడి సబ్ రిజిస్ట్రార్ ఆన్‌లైన్‌లో తనిఖీ చేయగా ఆ పత్రాలు నకిలీవని గుర్తించారు. వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశంతో రెండు రోజుల క్రితం ఎస్ఐ వెంకటసుబ్బయ్య విచారణ చేపట్టి పుల్లారెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

# సూపర్ సిక్స్ మోసగాడు చంద్రబాబు

- కమిషన్ కొట్టు అక్రమంగా ఖనిజ సంపదను కొల్లగొట్టు
- ఇసుక అక్రమ రవాణాకు కేంద్రంగా గంగాధరనెల్లూరు
- రాజకీయ కక్షలతో ఫీల్డ్ అసిస్టెంట్, సంఘమిత్రల తొలగింపు
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏనాడూ ఇచ్చిన మాటపై నిలబడిన దాఖలాలు లేవని, సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో ప్రజలను మరోసారి మోసం చేశాడని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. ఆయన శుక్రవారం శ్రీరంగరాజపురం మండలంలోని మంగుంటలో విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల కూటమి పాలన దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, కుట్రలు, అరాచకాలు, దాడులు, వైఫల్యాలు, రైతులు, మహిళలు, పిల్లలు, నిరుద్యోగులను మోసం చేయడం, నయవంచనతో సాగిందన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల తీరు కమిషన్ కొట్టు ఖనిజ సంపదను కొల్లగొట్టు అన్నట్లు ఉందన్నారు. గతంలో జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ మొదటి స్థానంలో ఉందని, ప్రస్తుత కూటమి పాలనలో చివరి స్థానానికి పడిపోయిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పోటీ పడాలని, అవినీతిలో కాదన్నారు. గంగాధరనెల్లూరు నియోజవర్గం నుంచి పక్క రాష్ట్రం తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. స్థానిక కూటమి నాయకులు కమీషన్ ఇవ్వకుంటే ఫ్యాక్టరీల నిర్వాహకులపై బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులను కావాలనే నిలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఫీల్డ్ అసిస్టెంట్, సంఘమిత్రలను తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

## కుప్పంలో కర్ణాటక పోలీసుల హల్‌చల్

కుప్పం: కర్ణాటక పోలీసులు శుక్రవారం కుప్పం పట్టణంలో హల్‌చల్ చేశారు. బెంగళూరు నగరంలోని ఒక ఇంట్లో ఇటీవల దొంగలు పడి భారీగా బంగారు నగలు చోరీ చేశారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. చోరీ చేసిన నగలను కుప్పంలోని ఒక నగల దుకాణంలో విక్రయించినట్టు తేలింది. దీంతో పోలీసులు కుప్పం పట్టణంలోని పలు బంగారు దుకాణాల్లో విచారణ చేపట్టారు. వాసుదేవ రోడ్డులోని ఒక దుకాణ యాజమాని బంగారు నగలను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. కొనుగోలు చేసిన నగలను స్వాధీనం చేయాలని అతనిపై ఒత్తిడి చేశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కర్ణాటక పోలీసులు కుప్పం వీధుల్లో సంచరిస్తుంటే పట్టణంలో చర్చనీయాంశమైంది.

## వార్డు కౌన్సిలర్ లైంగిక వేధింపులపై మహిళ ఫిర్యాదు

- చేయి కోసుకుని బాధితురాలి ఆత్మహత్యాయత్నం
- ఇదే నిందితునిపై ఉద్యోగాలిప్పిస్తానంటూ మరో వ్యవహారం వెలుగులోకి

పలమనేరు: పట్టణానికి చెందిన 17వార్డు కౌన్సిలర్ హైదర్‌బాష తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, ఆ బాధతో తాను ఆత్మహత్యకు యత్నించినట్టు ఒక మహిళ శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. జెండా మతానికి చెందిన వివాహిత తన భర్తకు సీఎంసీలో చికిత్స అందించేందుకు నగదు కోసం హైదర్‌కు బంగారు నగలిచ్చి రూ.2 లక్షలు తీసుకుంది. ఆపై ఆమె భర్త మృతి చెందడంతో ఆరు నెలల క్రితం గ్రూపులో అప్పుచేసి అతనికి నగదు చెల్లించింది. ఇప్పటి వరకు హైదర్ నగలు ఇవ్వకపోవడంతో ఆమె నిలదీసింది. దీనిపై ఆగ్రహించిన అతను ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. గురువారం రాత్రి ఆమెతోపాటు ఆమె అక్కపై దాడికి పాల్పడ్డాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

**మున్సిపాలిటీలో ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం**

మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ బేసిక్ కింద కంప్యూటర్ ఆపరేటర్ తదితర ఉద్యోగాలిప్పిస్తామని కౌన్సిలర్ హైదర్‌బాషా తమ నుంచి లక్షల్లో వసూలు చేశాడని బాధితులు మొగిలీశ్వర్, ముభారక్ తదితరులు శుక్రవారం మీడియా ముందుకొచ్చారు. ఇందులో గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ కిరణ్‌కుమార్ హస్తం కూడా ఉందని ఆరోపించారు. దీనిపై తమకు న్యాయం చేయాలనే పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఈ ఆరోపణలపై హైదర్ బాషాను వివరణ కోరగా కొంతమంది రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనలతో తనకు సంబంధం లేదని చెప్పడం గమనార్హం.

## రైలు కిందపడి ఇద్దరి దుర్మణం

- ప్రేమ ఫలించలేదని ఒకరు
- గుర్తు తెలియని మరో వ్యక్తి



అశోక్ (ఫైల్)

కుప్పం రూరల్ : కుప్పం రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం రైలు కింద పడి ఇద్దరు దుర్మరణం చెందారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. గుడుపల్లె మండలం యామిగానిపల్లికి చెందిన అశోక్ (24) కుప్పం పట్టణానికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపం చెందిన అశోక్ శుక్రవారం కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని పలవరిగానిమిట్ట వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో యామిగానిపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. అశోక్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

అదేవిధంగా బెంగళూరు – చెన్నై రైలు మార్గంలో కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని గుల్లేపల్లి వద్ద సుమారు 55 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం మొత్తం ఛిద్రం కావడంతో ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని రైల్వే పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## టెంపో ట్రావెల్లర్ బోల్తా

– ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో ఉన్న మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం టెంపో ట్రావెల్లర్‌ను బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. టెంపో ట్రావెల్లర్ వాహనం బెంగళూరు నుంచి తిరుపతి వెళుతోంది. మొగిలి ఘాట్ వద్ద వెనుక వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో టెంపో ట్రావెల్లర్ వాహనం రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైరెడ్డిపల్లెకు చెందిన బొలెరో డ్రైవర్ విజయకుమార్ కాలు విరిగిపోయింది. ఒక వృద్ధుడితో పాటు నలుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని 108లో బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వందశాతం కండిషన్‌లో ఉన్న బస్సు సరీ్వసులను ఎంపిక చేయాలని కడప జోన్–4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి డీపీటీఓ(జిల్లా ప్రజారవాణా అధికారి) కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, మెకానిక్ సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం కండిషన్‌లో ఉండే సర్వీసులను డిపోల వారీగా డీఎంల నుంచి స్వీకరించారు. 341 సర్వీసులు వంద శాతం కండిషన్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సర్వీసులను రోజుకు 2,700 ట్రిప్పులు తిప్పాలని ఆదేశించారు. అక్టోబర్ 9వ తేదీ గరుడోత్సవం రోజుతోపాటు 12వ తేదీ చక్రస్నానం శనివారం వస్తున్న నేపథ్యంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతలు బ్రహ్మోత్సవాల్లో పూర్తి సహకారం అందించాలని సూచించారు. అవసరం అయితే ఎప్పటిలాగానే బ్రహ్మోత్సవాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులను తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ప్రతి డిపో నుంచి బ్రహ్మోత్సవాలకు బస్సులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గత బ్రహ్మోత్సవాల్లో చోటుచేసుకున్న చిన్న చిన్న పొరబాట్లను సరిదిద్దుకుని ముందుకు సాగాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎస్వీయూలో 'నీలిట్' ఏర్పాటుకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నీలిట్ సంస్థ ఏర్పాటుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. శుక్రవారం పరిపాలనా భవనం వీసీ ఛాంబర్‌లో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు అధ్యక్షతన ఎస్వీయూ పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకమండలి సభ్యులు నేరుగా పాల్గొనగా, అమరావతి నుంచి ఉన్నత విద్యామండలి అధికారులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొని పలు అంశాలకు ఆమోద ముద్ర వేశారు. ఇందులో ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సంస్థను తిరుపతికి తీసువచ్చేందుకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి కేంద్రంతో పలు సార్లు సంప్రదించారు. దీంతో గత ఏడాది నీలిట్ సంస్థను ఎస్వీయూలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఆమోదించింది. ఈ సంస్థను ఏర్పాటుకు పాలకమండలి సైతం నేడు ఆమోద ముద్రవేసింది. దీంతో పాటు మరో 8 అంశాలపై పాలకమండలి ఆమోదం తెలిపింది.

ఇందులో ప్రధానంగా..

- వర్సిటీలోని మైక్రోబయాలజీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.1.02 కోట్ల నిధుల విడుదలకు ఏకగ్రీవ ఆమోదం లభించింది.
- ఫార్మసీ భవన నిర్మాణానికి రూ.2.08 కోట్లకు అనుమతి ఇచ్చారు.
- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్)ని వర్సిటీలో ఏర్పాటు చేయడానికి పాలకమండలి ఆమోదం లభించింది.
- వర్సిటీకి అనుబంధంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో విద్యార్థుల టాయిలెట్స్ కోసం రూ.76.80 లక్షల నిధులు మంజూరు.
- వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో టాయిలెట్ల కోసం రూ.85 లక్షల మంజూరుకు ఆమోదం తెలిపారు.
- ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ప్రమోషన్ల కోసం పాలకమండలి సమ్మతి తెలిపింది.
- దూరవిద్య విభాగంలో స్టడీ మెటీరియల్‌కు ప్రింటింగ్ సంబంధించిన పెండింగ్ బిల్లులకు పాలకమండలి ఆమోదం లభించింది.
- ఎస్వీయూకు అనుబంధంగా ఉన్న మూడు టీటీడీ అనుబంధ కళాశాలలు, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలకు అటానమస్ సౌకర్యం కల్పించడానికి పాలకమండలి ఆమోదం తెలిపింది.
- దూరవిద్య విభాగం పేరును ఇక నుంచి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ లెర్నింగ్‌గా మారుస్తూ పాలకమండలి ఆమోదం తెలిపింది. దూరవిద్యలో చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆన్‌లైన్ ద్వారా అందజేయనున్నారు. ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పాలకమండలి సభ్యులు సుగుణమ్మ, సురేంద్రనాథ్‌రెడ్డి, పద్మనాభం, కోలా మంజుల, మొద్దీన్‌బాషా, నారాయణబాబు హాజరయ్యారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, ప్రొఫెసర్ సుమకిరణ్, ప్రభుత్వ ఆర్థిక శాఖ విభాగం నుంచి డిప్యూటీ సెక్రటరీ ఆదినారాయణ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు.